## సామాజిక బాధ్యత చాటుకున్న డాక్టర్ దంపతులు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న విజయకృష్ణ మల్టీ స్పెషాలిటి హాస్పటల్ వైద్యులు మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు తమ సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు భీపంగ యశ్వంత్ నీట్‌లో 1301 ర్యాంక్ సాధించి ఉస్మానియాలో, మామిడి ఇందు నీట్‌లో 10150 ర్యాంకుతో గాంధీ హాస్పటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారు ఇరువురు పేదరికంలో ఉన్నారని చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదని ఆలోచనతో తాము తమవంతు సహాయం అందజేసినట్లు తెలిపారు. సమాజం కూడా స్పందించి వారి వైద్యవిద్యకు సహకరించాలని కోరారు.


# ప్రజాపక్షం

# జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 13 సెప్టెంబరు , 2026 | పేజీలు : 3


# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తి

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు





**ప్రజాపక్షం/అనంతగిరి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తిగా నిలిచిందని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరుగు కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు శనివారం మండలంలోని శాంతినగర్‌లో ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పేద రైతులు, కూలీలు, మహిళలు ఏకమై సాగించిన పోరాటం నిరంకుశ పాలన పునాదులను కదిలించిందన్నారు. అటువంటి యోధుల రక్తంతో తడిసిన తెలంగాణ గడ్డపై ప్రజా పోరాటాల చరిత్ర ఎప్పటికి చెరిగిపోనిదన్నారు. నేటి తరానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వివరించి, ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి ఎర్రసాని రవి, మండల ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి డేగ వీరన్న, శాఖ కార్యదర్శి బత్తిని వీరబాబు, గ్రామ సర్పంచ్ వాడకొప్పుల ఉమా, ఉపసర్పంచ్ గరిడేపల్లి స్వాతి, వ్యకాస జిల్లా నాయకులు నాగభద్రం, విద్యార్థి యువజన సంఘం నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తిభావంతో గణేష్ నవరాత్రులు

**ప్రజాపక్షం/గుండాల:** భక్తి భావంతో ప్రజలు గణేష్ నవరాత్రులను నిర్వహించుకోవాలని డిఎస్పి శ్రీనివాస నాయకుడు అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటి మండల స్థాయి సమావేశంలో డిఎస్పి పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులను నిర్వహించుకోవాలని అన్నారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ఉత్సవ కమిటి నిర్వాహకులు తప్పని సరిగా పోలీసుల అనుమతులను తీసుకోవాలని అన్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో డిజేలకు అనుమతి లేదని అన్నారు. ఈకార్యక్రమంలో సిఐ శంకర్, తహశీల్దార్ కృష్ణ, ఎంపిడివో చంఢీరాణి, ఎస్ఐ సైదులు, విద్యుత్ ఏఈ నర్సింహా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉత్సవ కమిటి నిర్వాహకులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శీనివాస్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల శీనివాస్ ను నియమిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పోచంపల్లి,జూలూర్ ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ లు పాక మల్లేష్ యాదవ్ ,కళ్లెం రాఘవ రెడ్డి, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు సహకారంతో ఈనియామకం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాసుల అంజయ్య గౌడ్, కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి, మాజి వైస్ ఎంపిపి సామ మధుసూదన్ రెడ్డి, మాజి వైస్ పిఎసిఎస్ సామ మోహన్ రెడ్డి ,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహా రెడ్డి తదితరులులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ నియామకంపట్ల పట్టణ మండల కాంగ్రెస్ పార్టి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఓటర్ల నమోదు పరిశీలన

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రం నాంపల్లి గ్రామంలోని 323 పోలింగ్ బూత్ సెంటర్ లో అనుమానాస్పద ఓటర్ల నమోదుపై అధికారులు దృష్టి పెట్టి పరిశీలించారు.ఓటర్లకు జారీ చేసిన నోటీసులు,అందుకు సంబంధించిన వివరాలను శనివారం మండల తహసీల్దార్ అంబటి ఆంజనేయులు క్షేత్రస్థాయి లో పరిశీలించారు.జాబితాలో ఒకే పేరు పునరావృతం కాకుం డా పలు వివరాలను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# మట్టి వినాయక విగ్రహాలు పూజిద్దాం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పర్యావరణ పరీరక్షణకై మట్టి వినాయక విగ్రహలను పూజిద్దామని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అన్నారు. శనివారం నేరేడుచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎక్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి పురస్కరించుకుని శనివారం పర్యావరణపరీరక్షణకై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్ పిడి యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు పాటుపడేలా మట్టి గణపతులనే పూజించాలని వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ ఎలిశాల రవిప్రసాద్ తనయుడు ఎలిశాల హేమచంద్ర పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వైఆర్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో భరత్,అభినవ్ రెడ్డి,వైఆర్ పి ఫౌండేషన్ ఆర్గానిజర్ యామ దయాకర్,48వ డివిజన్ కార్పొరేటర్ యామ కవిత,బమ్మపాల గిరిబాబు,వెంకట్ ,శివ,గణేష్, సురేష్, శివ,సంతోష్ పలువురు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను పూజించాలనే ఉద్దేశంతో శనివారం హనుమాన్ నగర్ లోని భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్ద మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.డీవీకే రోడ్డులోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఉద్దేశంతోనే హనుమాన్ నగర్, హైదరాబాద్ రోడ్డులో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు యాద, వాసుదేవ్, అలుగుబెల్లి శ్యాంసుందర్ రెడ్డి,విజయ్ రాజు,సిరిగిరి సురేష్ రెడ్డి, వాసుదేవరెడ్డి,రామలింగం పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు చదువుతో పాటు సమాజ హితం గురించి ఆలోచించి కాలుష్య రహిత వినాయకోత్సవాలను నిర్వహించుకోవాలని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి కోరారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్ సమన్వయకర్తలు శ్రీనివాస రావు, స్వప్న, ఐక్యూఏసీ సమన్వయకర్త నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.





## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా జరుపుకొని ప్రకృతిని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి కోరారు. శనివారం మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, 25వ వార్డు కౌన్సిలర్ మనోజ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిక్షారత్న అవార్డు గ్రహీతలకు ఆర్డీఓ అభినందన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల ప్రతిష్టాత్మక సంస్థల ద్వారా శిక్షారత్న అవార్డు అందుకున్న కేఎల్ ఎన్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు బికుమల్ల కిరణ్ కుమార్, తుమ్మలపల్లి నరేందర్ రెడ్డిలను ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి అభినందించారు. శనివారం మిర్యాలగూడలోని తమ కార్యాలయంలో విద్యావేత్తలను ప్రశంసించారు. నాణ్యమైన విద్యను అందిస్తూ మిర్యాలగూడ పట్టణంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవా లని కోరారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేఎల్ ఎన్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు బికుమల్ల కిరణ్ కుమార్, తుమ్మలపల్లి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఏచూరి జీవితం త్యాగాలమయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి జీవితం త్యాగాలమయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడ సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న ఏచూరి దేశంలో లౌకికత్వ పరిరక్షణకు, ఉపాధి హామీ పథకం సాధనకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రజాసమస్యలపై గళమెత్తారని, ఆయన ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి మంగారెడ్డి, మల్లు గౌతమ్ రెడ్డి, భావండ్ల పాండు, తిరుపతి, రామ్మూర్తి, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# మూడవత్ సైదానాయక్‌కి డాక్టరేట్




**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని డొంకతండా గ్రామానికి చెందిన మూడవత్ సైదానాయక్ శనివారం ఉస్మానియా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ ను పొందారు.ఉస్మానియా యూనివర్సిటీ 85 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో పీహెచ్ డీ పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్,యూనివర్సిటీ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై డాక్టరేట్ పట్టాలను అందజేశారు.పేద గిరిజన కుటుంబం నుండి వచ్చి అనేక కష్టనష్టాలను అధిగమించి డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్ననాటి నుండి చదువు పట్ల ఎంతో ఆసక్తి కలిగిన సైదానాయక్, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈ ఉన్నత స్థాయికి చేరుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.తన పరిశోధనకు సహకరించిన గైడ్ కు,కుటుంబ సభ్యులకు,స్నేహితులకు సైదానాయక్ కృతజ్ఞతలు తెలిపారు.తన డాక్టరేట్ ను తన తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోదాడ రూరల్ ఎస్ఐ షేక్ యాకూబ్ సూచించారు. ఉత్సవాల నేపథ్యంలో కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పోలీసు శాఖ నిబంధనలు, భద్రతా చర్యలను నిర్వాహకులకు వివరించారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు తావివ్వకూడదని, పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు.

# ఎబిఎపి బలోపేతానికి సభ్యులు కృషి చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబిఏపి)ను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో సంస్థను విస్తరించి బలోపేతం చేయాలని ఏబిఏపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీఫ్ కోఆర్డినేటర్ రాచర్ల రమేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టివి పుల్లంరాజు, జాతీయ కోశాధికారి ఆర్. రవిరాజులు అన్నారు. శనివారం సూర్యాపేట అయ్యప్ప స్వామి దేవాలయంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు ముత్యంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంస్థ ద్వారా కేరళ రాష్ట్రంలోని శబరిమల దేవస్థానం బోర్డుతో చర్చలు జరిపి భక్తులకు జరిగే ఇబ్బందులను వారికి వివరిస్తూ పరిష్కారం అయ్యేలా చూస్తున్నామన్నారు. శబరిమల దగ్గర మండల పూజ, మకరవిల్క్ సందర్భంలోనే కాకుండా ప్రతినెలా ఐదు రోజులు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. శబరిమల వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసేలా ఏబిఏపి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, దూశెట్టి భాస్కర్, పోతరాజుల రమేష్, భూపతి శ్రీనివాస్, సంతోష్ కుమార్, తిరుపతి, జెరిపోతుల లక్ష్మణ్, మాశెట్టి నరేష్, పిఆర్ఓ చౌదర్ రెడ్డి, బెలిదె శ్రీనివాసులు, రాంబాబు, బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఏబిఏపి సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులుగా అయ్యప్ప స్వామి దేవాలయం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులును నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటి నిర్ణయం మేరకు రాష్ట్ర అధ్యక్షులు పుల్లంరాజు ప్రకటించారు. గౌరవ సలహాదారులుగా ఎలుగూరి రాంబాబు గౌడ్, కుంభం రాజేందర్, అన్నెపర్తి రాజేష్ లను నియమించినట్లు తెలిపారు.

## రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కామ్రేడ్ మల్లు స్వరాజ్యం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాలేశ్వరం ప్రాజెక్టుతో రైతులను నీరు అందించి పంటలు కాపాడుతారని ఆశించిన రైతులకు కన్నీళ్లు మిగిలాయన్నారు. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తామని మభ్యపెట్టి నేడు రెండు, మూడు గంటలకే పరిమితం చేశారని ఇప్పటికైనా 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, చెరుకు ఏకలక్ష్మి , పులుసు సత్యం, కందాల శంకర్ రెడ్డి, వజ్జె శ్రీనివాస్ పాల్గొన్నారు.








## పల్లా సుధీర్‌రెడ్డి మృతి బాధాకరం

**ప్రజాపక్షం/దేవరకొండ;** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందడం బాధాకరం అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శనివారం దేవరకొండ మండలంలోని పడమటిపల్లిలో నర్సింహారెడ్డి స్వగృహానికి వెళ్లి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ అండదండలు నర్సింహారెడ్డి కుటుంబానికి ఎప్పుడు ఉంటాయని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సానుభూతిని తెలిపిన వారిలో ఏఐటీయూసీ నాయకులు నూనె రామస్వామి, నూనె వెంకటేశ్వర్లు, జవహర్‌లాల్, దేవయ్య, లాబాను, బుచ్చయ్య, రాజా, అయోధ్య తదితరులు ఉన్నారు.

### పల్లా నర్సింహారెడ్డిని పరామర్శించిన టిపిసిసి సభ్యుడు జాల నర్సింహారెడ్డి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి ఇటీవల మరణించడంతో శనివారం టిపిసిసి సభ్యులు చిత్రియాల పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి పడమటిపల్లిలోని పల్లా నర్సింహారెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, ఏఈచందు, సత్తిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక దృఢత్వం అవసరం



**ప్రజాపక్షం/చివ్వెంల :** విద్యార్థినులకు చదువుతోపాటు శారీరక, మానసిక ధృడత్వం అవసరమని అందుకు సమతుల్య పోషకాహారం తీసుకోవాలని ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు అనూష, రవితేజ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కెజిబివిలో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లు అందజేసి మాట్లాడారు. కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. బాలికల సంపూర్ణ వికాసానికి, ఉజ్వల భవిష్యత్తుకు పౌష్టికాహారం ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, కెజిబివి ఎస్ఓ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

## కోట మల్లారెడ్డికి ప్రముఖుల నివాళి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మాజీ జడ్పిటిసి భర్త కోట మల్లారెడ్డి దశదిన కర్మకు రాజకీయ ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు.శనివారం కనుముకుల గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎలిమినేటి ఉమా మాధవ రెడ్డి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, ఎంపి బడుగుల లింగమయ్య యాదవ్, కంచర్ల భూపాల్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## స్వీట్ షాపు ప్రారంభం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మజీ స్వీట్ హౌస్‌ను మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత అనేక రంగాలలో రాణించడానికి అవకాశాలున్నాయని, స్వయం ఉపాధితో తన కుటుంబాన్ని పోషించడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ, నిర్వాహకులు, రాచకొండ రామన్న, వీరబాబు, అజ్మతుల్లా, ముక్కంటి, తాళ్లూరి లక్ష్మీనారాయణ, చింతకాయల రాము పాల్గొన్నారు.

## ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. శనివారం రామన్నగూడెం గ్రామంలోని ఎస్‌టి కాలనీలో నూతన పైపులైన్ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయితీ నిధులు సుమారు రూ.1లక్ష వ్యయంతో నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు తవిటి సైదులు, ముఢావత్ తనేష్, స్రవంతి, నాయకులు పాల్గొన్నారు.

## క్షుద్రపూజల కలకలం



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం స్థానికంగా తీవ్ర భయాందోళనను రేకెత్తించింది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి గేట్ల ముందలి మెట్లపై పసుపు, కుంకుమలు కలిపిన నిమ్మకాయలు, నల్లకోడి సహ ఇతర పూజా సామాగ్రిని విస్తరాకులలో ఉంచి వెళ్లారు. ఉదయాన్నే లేచీ ఈ భీతావహ దృశ్యాన్ని చూసిన కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇది నిజంగానే క్షుద్రపూజాల, లేక ఎవరైనా ఆకతాయిలు కావాలనే ఇటువంటి పనికి పాల్పడ్డారా అనే అనుమానులు స్థానికులలో వ్యక్తమవుతున్నాయి.

## ఫసల్ బీమా యోజన అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేయడం లేదని బిజెపి గుండాల మండల అధ్యక్షులు పింగళి విజయ్ భాస్కర్‌రెడ్డి విమర్శించారు. రైతులకు పంట నష్టం జరిగినప్పుడు బీమా పరిహారం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని దీంతో రైతుల ఆర్ధిక వ్యవస్థ కొద్దిగైనా మెరుగుపడుతుందని రైతుల పక్షాన ఆయన డిమాండ్ చేశారు.

## బుల్లెట్ ట్రైన్ సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిటి టాలెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ మురళి అన్నారు. శనివారం సిటి టాలెంట్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుల్లెట్ సాధనకు మద్ధతుగా ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. వాణిజ్యపరంగా సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బుల్లెట్ ట్రైన్ వస్తే అభివృద్ధి మరింత జరిగే అవకాశం ఉందన్నారు. శంషాబాద్ నుండి వయా సూర్యాపేట మీదుగా చెన్నైకి బుల్లెట్ ట్రైన్ మొదటగా ఆలైట్‌మెంట్ ఇచ్చిన దాన్ని రద్దు చేస్తూ సూర్యాపేట ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. సూర్యాపేట ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షైన రైల్వే మార్గం వచ్చేలా ప్రభుత్వాలు సహకరించాలన్నారు. అంతకముందు ఆమ్ ఆద్మీని పార్టీ ఆధ్వర్యంలో రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటి టాలెంట్ పూర్వ విద్యార్థులు అంతటి సాత్విక్ సాయి, సుంకరబోయిన ఉదయ్ కుమార్, వాస హర్ష, రేవంత్ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు కుంట్ల ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, సట్టు నాగయ్య, రాములు పాల్గొన్నారు.

## చెరువును బయటి వ్యక్తులకు లీజుకు ఇస్తున్నారు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ నిబంధనలు,మత్స్యశాఖ బైలా నిబంధనలకు విరుద్ధంగా చెరువును బయటి వ్యక్తులకు శాలిగౌరారం పెద్ద చెరువు లీజుకు అప్పగించి దళారులు లబ్ధి పొందుతున్నారని శాలిగౌరారం మత్స్యకార సొసైటీ సభ్యులు పడాల వెంకన్న,నూతి సత్యనారాయణ ఆరోపించారు. శనివారం నల్లగొండజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాలిగౌరారం మత్స్యకార సొసైటీలో అక్రమాలు,నిబంధనల ఉల్లంఘన జరుగుతుందని ప్రశ్నించిన తమ నాయకుడు ఎల్‌వీ రమణ ముదిరాజ్‌పై కొంతమంది కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలు, మత్స్యశాఖ బైలా నిబంధనలకు విరుద్ధంగా చెరువును బయటి వ్యక్తులకు లీజుకు అప్పగించి దళారులు లబ్ధి పొందుతున్నారని అన్నారు. చెరువులను బయటి వ్యక్తులు,దళారులకు లీజుకు ఇవ్వడం వల్ల అసలైన మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల విక్రయం ద్వారా వచ్చే అసలు లాభాలు సొసైటీ సభ్యులకు దక్కకుండా,నామమాత్రపు కూలీ మాత్రమే లభిస్తోందని ఆరోపించారు.సమస్య పరిష్కారం కాకపోతే రమణ ముదిరాజ్ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిపి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు పడాల నారాయణ,బోళ్ల నాగరాజు,పడాల రవి,గంధసిరి సత్యనారాయణ,వాడపల్లి శివరాజ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని సుంకిశాల గ్రామపంచాయతీ పాత ఊరు ఇండ్ల స్థలాలను,గ్రామ కంఠం భూమిని దౌర్జన్యంగా యజమానులకు తెలియకుండా పట్టా చేసుకున్న తుమ్మలపల్లి రాజవర్ధన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని,అలాగే పట్టా చేసిన రెవెన్యూ సిబ్బందిపై తగు చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సుంకిశాల గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సుజాతాదేవి,భర్త లోహిత్ రెడ్డి వద్ద ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకుని 30 సంవత్సరాలు ఇక్కడే నివసించామని తెలిపారు.అసౌకర్యాల కారణంగా మెయిన్ రోడ్డు స్టేజీ వద్దకు వెళ్లడం జరిగిందని, అయితే ఖాళీగా ఉన్న పాత ఊరు గ్రామకంఠం ఇండ్ల స్థలాలను యజమానులకు తెలియకుండా దౌర్జన్యంగా పట్టా చేసుకుని ఇండ్లను జేసీబీతో కూల్చివేసి కంచె వేయాలని చూస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ బాసిపాక రాములు, బుడిగపాక లక్ష్మయ్య,ఆడపల్లి జయమ్మ,పిల్లి లక్ష్మమ్మ, ఎరుకల ఆంజనేయులు,కలకొండ లక్ష్మయ్య, బుడిగపాక వెంకటయ్య,అబ్బనబోయిన లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో ఆనంద్‌కు డాక్టర్ పట్టా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణ పరిధిలోని కేశరాజు పల్లిలో నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి బొజ్జ ఆనంద్ తన ప్రాథమిక విద్యాభ్యాసం కేశరాజు పల్లి.పాఠశాలలో పదవ తరగతి చదివి ఆపై చదువులకు నల్లగొండ పట్టణంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకుని ఉన్నతమైన చదువులకు హైదరాబాద్‌లో ఉండి ఎంతో కష్టపడి అద్దె రూమ్‌లో ఉండి చదువు మీద మక్కువ పెంచుకొని పీహెచ్‌డి పూర్తి చేయాలని కసి పెంచుకొని ఎన్నో కష్టాలు పడి పీహెచ్‌డి పూర్తి చేసుకుని తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైనఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్,యూనివర్సిటీ చాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా ,వైస్ ఛాన్సులర్ ప్రొఫసర్ కుమార్ మొలగరం భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ ఎల్లా చేతుల మీదుగా పీహెచ్‌డి పట్టాను అందుకున్నారు.ఈ సందర్భంగా బొజ్జ ఆనంద్ మాట్లాడుతూ తనతల్లిదండ్రులకి తన అన్న అనిల్ కుమార్ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తూ తన పరిశోధనకు సహకరించిన ప్రొఫసర్ గుండా ప్రభాకర్ సార్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా ప్రజలు గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ కోరారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని, తద్వారా మన సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరిగిపోకపోవడంతో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం ఉన్నందున నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మన నీటి వనరులను కాపాడుకుందాం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించి, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు సహకరించాలని కోరారు.

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వినాయక విగ్రహాలు నిమజ్జనంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ చరమందరాజు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలంలోని కృష్ణానదిపై మట్టపల్లి బ్రిడ్జి వద్ద సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరగనున్న వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మట్టపల్లి బ్రిడ్జి వద్ద గల నిమజ్జన ఘాట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం సాఫీగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రదేశంలో భారీ లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్, ఎంపిడివో, ట్రాన్స్‌కో ఎఈ, పంచాయతీ రాజ్ ఎఈ, ఫైర్ ఆఫీసర్ స్థానిక సర్పంచ్, ప్యాక్టరీ ప్రతినిధులు, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వరుణయాగం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శబరినగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం వరుణయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తాంత్రిక్ జ్ఞానసాయి శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ లోకకళ్యాణార్థం వర్షాలు కురువాలని పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ 1008 కళశాలతో శతఘటాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వరుణయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు రావడం లేదని మనం చేయాల్సిందల్లా దైవంపై భారం వేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొరిశెట్టి లక్షాది, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి, ఎలిమినేటి అభినయ్, చిలుముల సునీల్ రెడ్డి, వీరన్న నాయక్, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాంబమూర్తి

**ప్రజాపక్షం/వేములపల్లి:** కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేములపల్లి మండల కేంద్రానికి చెందిన చిర్ర సాంబమూర్తి యాదవ్ ను నియమిస్తూ శనివారం కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాసులు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కిసాన్ మోర్చా బాధ్యతలు అప్పగించినందుకు శక్తివంచన లేకుండా రైతు సంక్షేమం కోసం, పార్టీ ప్రతిష్ట కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.